# బొట్టు

''పద్మా'' గేటు దాటి బైటికెళ్లబోతున్న నేను వెనక్కి తిరిగి చూశాను.

అమ్మ మొహంలో చికాకు.. కోపం కలగలిపి, గుమ్మంలో నుంచుంది.

నేను గిరుక్కున్న తిరిగి లోపలికి నడవబోయి,ఆగిపోయాను. చేతిలో కూరలబుట్ట పట్టుకుని, తలవంచుకుని లోపలికొస్తోన్న కళ్యాణి కనిపించింది.

అమ్మ నన్ను వెనక్కి ఎందుకు పిలిచిందో అర్ధమైంది. నేను నిలబడ్డచోటే అస్థిమితంగా కదిలాను, ముందుకెళ్తే అమ్మకు కోపం వస్తుంది... వెనక్కి వెళ్తే కళ్యాణి బాధపడవచ్చు.. రెండు నిమిషాలు గడిచాక కళ్యాణి తమ వాటావైపు వెళ్ళడం చూసి.. నేను అమ్మ దగ్గరికి నడిచాను.

'బుద్ధుందా నీకు? ఇంటర్వ్యూకి వెళ్తూ శకునం చూసుకోకుండా వెళ్ళడమేనా?'' అమ్మ మండిపడింది.

'' ఏవిటమ్మా నీ చాదస్తం... కళ్యాణి ఎదురొస్తే ఏమైంది?'' అన్నాను చికాకు అణచుకొంటూ.

''చాల్లే.. ఒంటి బ్రాహ్మడు.. విధవ, పిల్లి.. ఇలాంటి శకునాలు ఎదురవకూడదు అని ఎన్నిసార్లు చెప్పాను? తగుదునమ్మా అని.. పొద్దున్నే బయల్దేరుతుంది వీధిలోకి.. ఈ దరిద్రపు గేటు.. అన్ని వాటాలకి ఇదేనాయె..'' అమ్మ సణగటం ప్రారంభించింది. అమ్మ తృప్తి కోసం ఓ క్షణం కూర్చుని లేచి... బయల్దేరాను.

పాపం కళ్యాణి!

పెళ్ళి అయిన మూడేళ్ళకే భర్తని కోల్పోయిన దౌర్భాగ్యురాలు..

పట్టుమని పాతికేళ్ళు లేని కళ్యాణి జీవితం ఎడారి అయిపోయింది.

చదువు కూడా స్కూల్ ఫైనల్ దాటని ఆమె పుట్టింట్లో చేరి, అన్నా

వదినల పిల్లల్ని చూసుకొంటూ, తల్లికి చేదోడు, వాదోడుగా జీవితం గడుపుతోంది. సనాతనుడైన కళ్యాణి తండ్రి ఆ పిల్లని అక్షరాలా విధవరాలుగా మార్చాడు. నాలాంటి వాళ్ళు అడ్డం పడకపోయి ఉంటే, అందమైన ఆమె జడ కత్తిరించి.. జుట్టు కూడా పూర్తిగా తీయించేవాడు.

అదే ఇంట్లో... అదే వీధిలో ఆడిపాడిన కళ్యాణిని కన్నెపిల్లగా ఉన్నప్పుడు.. అదేపనిగా పిలిచి ''శకునం రామ్మా.. నీ శకునం మంచిది' అంటూ అభినందించినవాళ్ళే ఈనాడు ఆ పిల్ల అనుకోకుండా ఎదురైనా మొహాలు మాడ్చుకుని .. చిరాకు పడటం ప్రారంభించారు.

భర్తను పోగొట్టుకుని పుట్టిల్లు చేరిన ఆరునెలల్లో ఒక్కనాడు కూడా ఆ మొహంలో లీలామాత్రంగా సంతోషం వెలుగు చూడలేదు. నాతో కలిసి ఆడుకొని హాయిగా కబుర్లు చెప్పుకుంటూ తిరిగిన కళ్యాణి ఈనాడు నాతో మాట్లాడటం కూడా మానేసింది. తను ఎదురైనప్పుడల్లా నా హృదయం విలవిల్లాడుతుంది. తన ఈడు దాన్నైన నేను పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి... ఉద్యోగాన్వేషణలో ఉన్నాను. ఉద్యోగం రాగానే వరుని అన్వేషణ.. చేస్తారు. పెళ్ళిచేసుకుని కొత్త జీవితం ప్రారంభిస్తాను. నా బ్రతుకు పుస్తకంలో సెకండ్ పార్టు ప్రారంభమవుతుంది.. కానీ.. కానీ, నా వయసే అయినా కళ్యాణి బ్రతుకు పుస్తకం సగంలోనే ఆగిపోయింది.. ఇంక ఆమెకు వర్తమానం తప్ప... భవిష్యత్ లేకుండా చేస్తున్నారు చాదస్తులు

బాధగా నిట్టూర్చాను...

బస్సు దొరికి.. నేను ఇంటర్వ్యూకి చేరేప్పటికి ఐదునిమిషాలు ఆలస్యమైంది. డిసిప్లిన్ లేదని, టైమ్ సెన్స్ లేదని తేల్చిన అధికారులు నన్ను సెలెక్ట్ చేయలేదు. బహుశా అమ్మ నన్ను వెనక్కి పిలవకుండా ఉండి ఉంటే ఆ ఐదు నిమిషాలు కలిసి వచ్చేవేమో అనిపించింది. కానీ ఇంటికెళ్ళాక ఆతృతగా ఎదురొచ్చిన అమ్మ ఈ వార్త విని కళ్యాణిని శాపనార్థాలు పెట్టింది. నాన్న అడ్డుపడకపోయి ఉంటే ఆ ప్రవాహం అలా ఎంతసేపు సాగిపోయేదో! పోనీలేమ్మా ఈ కంపెనీ అంత మంచిది కాదుట. సెలక్ట్ అవకపోవడమే మంచిదైంది. మరో మంచి కంపెనీలో మంచి ఉద్యోగం వస్తుంది నిరాశపడకు అన్నారు నాన్న

ఆ ఓదార్పు నాకెంతో ఊరట కలిగించింది.

ఆ ఉరటకి కారణం కళ్యాణకి అపనిందరాలేదన్న సంతృప్తి..

నేను ఉద్యోగప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నాను. నాలుగు నెలలు గడిచిపోయాయి. అది ఆగస్టు నెల. వర్షాలు ఉధృతంగా పడుతున్నాయి. అప్పటికి నేను దాదాపు ఐదారు ఇంటర్వ్యూలకు వెళ్ళొచ్చాను. ఎందులోనూ సెలెక్ట్ అవలేదు. రెండు కంపెనీలవాళ్ళు మాకు లేడీస్ వద్దండి అని చెప్పారు. ఆడవాళ్ళ ప్రవేశానికి నిషిద్ధం ఉన్న మరో ప్రపంచం చూడాలన్న కుతూహలం అణుచుకోలేక తప్పలేదు. అన్ని ఇంటర్వ్యూలకి కళ్యాణి శకునం రాకుండా అమ్మేకాదు ఆనోటా, ఈ నోటా అమ్మ అభిప్రాయాలు విన్న కళ్యాణి కూడా చాలా జాగ్రత్తపడింది. నేను సెలెక్ట్ అవలేదే! అన్న ధర్మ సందేహం అమ్మ మనసులో తొలుస్తూనే వుంది.

ఆ రోజు శ్రావణ శుక్రవారం.. బైట బాగా వర్షం కురుస్తోంది. మా ఇంటిప్రక్క వాళ్ళింట్లో కొత్త కోడలు వరలక్ష్మి నోము నోచుకుంది.. అందరూ పేరంటానికెళ్ళారు. అమ్మ కూడా వెళ్ళింది. నాన్న ఆఫీసునుంచి ఇంకా ఇంటికి రాలేదు. నేనొక్కదాన్నే పెరట్లో నిల్చున్నాను. మా ఇంటి వెనకవైపు గోడ కవతల కళ్యాణి వాళ్ళిల్లు. పెరటి వసారాలో నిల్చుని వర్షాన్ని చూస్తోన్న నేను గోడ దగ్గరికి వచ్చి నిల్చున్న కళ్యాణిని చూసి ''హాయ్ కళ్యాణీ'' అని పలకరించాను. కళ్యాణి సన్నగా చిరునవ్వు నవ్వింది. '' మా ఇంటికి రాకూడదూ! ఒక్కదాన్నే ఉన్నాను బోర్ కొడుతోంది'' అన్నాను. కళ్యాణి పేలవంగా నవ్వి అన్నది ''ఏముంది పద్మా-''

''రోజూ వుండే పనేగా తరువాత చేసుకోవచ్చులే రా''

'' మీ ఇంటి ప్రక్కన పేరంటం జరుగుతుందిగా.. నువ్వెళ్ళలేదేం'' అడిగింది కళ్యాణి.

''అవన్నీ నాకు బోర్.. అమ్మ వెళ్ళింది. నువ్వురా పోనీ ఇద్దరం వెళ్ళొద్దాం.''

కళ్యాణి బాధగా చూసింది.

''నేనొస్తే నన్నక్కడే పాతేస్తారందరూ కలిసి''

కళ్యాణి కంఠంలోని వణుకు, ఆవేదన నా గుండెల్ని కోసినట్లైంది

''సారీ కళ్యాణీ క్యాజువల్‌గా నిన్ను బాధపెట్టాలని కాదు''

నొచ్చుకుంటూ అన్నాను.

కళ్యాణి నవ్వింది...

ఆ తరువాత రాత్రంతా నాకు నిద్రపట్టలేదు. కళ్యాణి ఏం తప్పు చేసిందని ఈ సంఘం ఆమెని వెలేస్తోంది.

పుట్టిన పదకొండో రోజు నుండే ఆడపిల్లకు బొట్టూ, కాటుకా, నగలతో అలంకరిస్తారే... పుట్టుకతో సంపాదించుకున్న ఈ హక్కులు మధ్యలో వచ్చి అకాలమరణం పొందిన భర్తతోటే పోతాయా?.. ఇదెక్కడి సంప్రదాయం! ఎవరు చేసిన శాసనం.! ఎవరు రాసిన ధర్మసూత్రం!

స్వేచ్ఛ కోసం.. సమాన హక్కుల కోసం.. పోరాడుతూ.. అంతులేని విజ్ఞానం కోసం ఆరాటపడుతూ.. ప్రగతిపథంవైపు పరుగులు తీస్తోన్న ఈ మహిళాలోకం.. తోటి స్త్రీకి జన్మతః వచ్చిన హక్కులైన.. కొంచెం కుంకుమ, ఓ చిటికెడు పసుపు ఇవ్వడానికి ఇన్ని నిబంధనలు ఎందుకు ఏర్పరచారు?

సంఘజీవిగా బ్రతుకుతూ.. తన అనుభూతుల్ని, ఆనందాన్ని ఆ సంఘంతో పంచుకున్న కళ్యాణి గుండెల్లోని విషాదాన్ని కేవలం ఆమెకి మాత్రమే వదిలేసి.. ఒంటరిగా నాలుగు గోడల మధ్య మగ్గమని ఎలా శాసించగలుగుతున్నారు?... కళ్యాణి సమస్యకు పరిష్కారమే లేదా? కళ్యాణి సమస్యకు పరిష్కారం ఆలోచిస్తుండగానే రోజులు గడిచిపోయాయి.

ఆ రోజు నాకు రిజిష్టర్ పోస్టులో ఓ కెమికల్ కంపెనీలో ఉద్యోగం వచ్చినట్టుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చింది...

అమ్మ సంతోషానికి పట్టపగ్గాల్లేవు.. అందుకు కారణం ఉంది. నాకు ఉద్యోగం దొరికితే గానీ నేను పెళ్లి చేసుకోనని పంతం పట్టడంతో.. నా ఉద్యోగం విషయంలో నాకన్నా ఎక్కువగా అమ్మే ఆరాటపడింది.

నాన్నగారు కూడా చాలా సంతోషించారు.

అమ్మ నన్ను వెంకటేశ్వర స్వామి గుడికి వెళ్ళి కొబ్బరికాయ కొట్టిరమ్మంది.

నేను.. తయారై బజార్లో కొబ్బరికాయ, పూలు, అగర్‌బత్తులు కొనుక్కొని గుడికెళ్ళాను.

జనంలేరు.. పూజారి గారు నే వెళ్ళగానే హారతిచ్చి, కొబ్బరికాయ కొట్టి ప్రసాదం ఇచ్చారు. విశాలమైన అరుగులతో పెద్ద, పెద్ద రావి, వేప చెట్లతో ప్రశాంతంగా, ఆహ్లాదంగా ఉన్న ఆ వాతావరణంలో కాస్సేపు కూర్చోవాలనిపించింది.. గర్భగుడి వెనకవైపు విశాలమైన ఖాళీ స్థలం ఉంది... అటుగా వెళ్ళిన నేను ఉలిక్కిపడ్డాను. సంధ్య చీకట్ల చిరువెలుగులో తెల్లని వాయిల్‌చీర భుజం మీదికి లాక్కొని.. మోకాళ్ళ మీద గడ్డం ఆన్చి కూర్చుని ఉంది కళ్యాణి.

''కళ్యాణీ!'' నేను భుజం మీద చేయివేశాను వంగి.. ఉలిక్కిపడి చూసింది.. బాగా ఏడ్చినట్లు ఉబ్బి ఉన్నాయి కళ్ళు. ఆ కళ్ళలో ఉబికి, ఉబికి వస్తోన్న కన్నీరు నా మనసుని కలిచివేసింది.

'' ఇక్కడ కూర్చున్నావేం''

కళ్యాణి మాట్లాడలేదు.. పెదాలు బిగపట్టి దుఃఖం ఆపుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తోంది.. కానీ ఆమె ప్రయత్నం ఫలించలేదు. సన్నని వెక్కిళ్ళు ఆ నిశ్శబ్దమైన వాతావరణంలో హృదయవిదారకంగా వినిపించసాగాయి.

కాస్సేపు అలా ఏడవనిచ్చి నెమ్మదిగా ఓదార్చాను.

''కళ్యాణీ! నాకు తెలుసు నువ్వెందుకిలా ఒంటరిగా కూర్చుని ఏడుస్తున్నావో!.. నీతో మాట్లాడాలని చాలా కాలంగా ప్రయత్నిస్తున్నాను. నాకు అవకాశం రాలేదు. ఇవాళ నిజంగా చాలా మంచిరోజు. చూడు కళ్యాణీ! మీ వారు చనిపోవడం నీ వలన కాదు, అలాంటప్పుడు నువ్వెందుకు శిక్ష అనుభవించాలి?''

'' నా ఖర్మ'' కసిగా అంది.

''కాదు మీ వాళ్ళ చాదస్తం.. నీ పిరికితనం''..

''పద్మా!'' విహ్వలంగా చూసింది.

''అవును కళ్యాణీ! కాలం మారిపోయింది. ఇంకా మారుతుంది. శాస్త్ర విజ్ఞానం పెరిగి రేపో, మాపో మనిషి అంతరిక్షంలో నివాసం ఏర్పరచుకోబోతున్నాడు. అయినా మీ వాళ్ళు మారలేదు. అసలిలాంటి వాళ్ళు మారరు కూడా.. అందుకే మనం వాళ్ళని పట్టించుకోకూడదు.''

''పట్టించుకోకపోతే ఆ ఇంట్లో ఎలా ఉండగలను పద్మా! వాళ్ళ మీద ఆధారపడి బ్రతుకుతున్నాగా''

''అలాగని వాళ్ళ అర్ధంలేని ఆచారాలకు బలైపోతూ బతుకుతావా?''

''దేవుడిలా రాసిపెట్టాడు''

'' ఆయన ఆనాటి కాలమాన పరిస్థితుల్ని బట్టి అందరికీ ఒకే కొటేషన్ రాశాడు.. అవి మనం చెరిపేసి మళ్ళీ మార్చి రాసుకోవచ్చు... కళ్యాణీ! మన పెద్దవాళ్ళు అప్పటి పరిస్థితులకి తగిన తెలివితేటలతో కొన్ని పద్ధతులను ఆచరించడం ప్రారంభించి.. వాటినే సంప్రదాయాలు ఆచారాలు అంటూ మనల్ని ఫాలో అవమంటున్నారు. కానీ మనం వాళ్ళకన్నా ఎక్కువ తెలివిగా, వివేకంతో ఆలోచించగలం కదా! మనమూ కొన్ని కొత్తపద్ధతులని ప్రవేశపెట్టి ... ఇవి ఈ తరం ఆచారాలందాం... ఈ ఆచారాలు ఎవరికీ హాని చేసేవి కావు కాబట్టి.. మన తరువాత తరం వారు ఆచరించినా ఇబ్బందేం ఉండదు''

'' ఏం చేయమంటావు పద్మా! చదువుకూడా అంతంత మాత్రమే నాకు. పోనీ నాకాళ్ళ మీద నిలబడాలన్నా ఉపాధి దొరికే మార్గం లేదు.. అటు సంపాదన లేదు. ఇటు సంఘంలో గౌరవం లేదు. నా కుటుంబంలో నా పట్ల అభిమానం, అప్యాయత, సానుభూతి లేదు. నేనెందుకుబ్రతకాలి? ఎవరి కోసం బ్రతికాలి? నే నెదురు పడితేనే అసహ్యించుకుంటారు.. నేనేం పాపం చేసాను?''

''దీనికి కారణం నువ్వే!''

''నేనా!''

''అవును లేకపోతే ఏవిటీ వేషం బొట్టు, గాజులూ లేకుండా''

''అవన్నీ నిషిద్ధం కదా నాకు.. విధవలకి గాజులెందుకు?''

''నాన్సెన్స్'' చిరాకుపడ్డాను. '' ఒకప్పుడు మన అమ్మమ్మలు లోపల పెట్టీకోట్ లేకుండా చీరలు కట్టుకునేవాళ్ళు... కాళ్ళకి చెప్పులు లేకుండా ప్రయాణం చేసేవాళ్ళు.. అవన్నీ నువ్వు చేయగలవా?''

''అవి ఆచారాలు కాదు. వాళ్లకి అందుబాటులో లేకపోవడం చేత వాళ్ళవి వాడి ఉండరు.''

''యస్! కరెక్ట్.. ఇదీ అంతే.. ఈ నాడున్న ఎన్నో కొత్త కొత్త అవకాశాలు వాళ్లకి ఆనాడు అందుబాటులో లేకే ఉన్నవాటిని ఆచారాలన్నారు.. చూడు కళ్యాణి నిన్ను నువ్వు గౌరవించుకోలేనంత కాలం నిన్నెవరూ గౌరవించరు. నీ శరీరాన్ని నువ్వు ప్రేమించినప్పుడే నిన్ను నీ శరీరం కూడా ప్రేమిస్తుంది. నువ్వు ఈ క్షణం దాటిన మరుక్షణంనుండి ఇలా వుండకూడదు... ఇదిగో ఇది దేవుడి కుంకుమ. తీసి బొట్టుపెట్టుకో..

''పద్మా!' కంపిస్తున్న కంఠంతో పిలిచింది.

''నాన్న చూస్తే చంపేస్తారు''

'' ఏం చంపరు, తిడతారు, మండి పడతారు, ఆచారం మంటకలిపావని రంకెలేస్తారు. అంతేగా! అది ఓ రెండురోజులు అంతే. ఆ రెండు రోజులు నువ్వు మౌనం వహించు. ఆ తరువాత ఆయనే శాంతిస్తారు. ఓసారి నిన్ను బొట్టు, కాటుకతో చూడడానికి అలవాటు పడ్డాక ఎప్పుడైనా నువ్వు బొట్టు పెట్టుకోకపోతే ఆయన చిరాకుపడతారు. తెల్సిందా! ఊ పెట్టుకో'' బలవంతపెట్టాను.

''నాకు భయం వేస్తోంది'' అన్నది.

''భయం దేనికీ? ఇదేం హత్య చేయడమా? దేవుడి బొట్టేగా పెట్టుకో-నేనే పెట్టేదాన్ని కానీ మరీ సినిమాటిక్‌గా ఉంటుంది. అదీకాక, ఓసారి అలవాటు తప్పిన నీ చేయి మళ్ళీ బలవంతంగా ఈ కుంకువు తాకితే నీకొక్కండంత ఆత్మస్థైర్యం కలుగుతుంది. అందుకే నిన్ను పెట్టుకోమంటున్నాను''

''తప్పు కాదా?''

'' ఎంతమాత్రం కాదు.. పెట్టుకోకపోతే తప్పు''

కళ్యాణి సందేహంతోటి, భయంతోటి కొన్ని క్షణాలు తాత్సారం చేసి సన్నగా వణుకుతున్న చేత్తో కుంకుమ నుదుట పెట్టుకుంది.

కథా నిలయం
5082
శ్రీకాకుళం

''కళ్యాణీ! నీ కొత్త జీవితానికి ఇది నాంది గీతం.. చూస్తుండు రేపట్నించి నీ జీవితంలో ఎంత మార్పువస్తుందో! విధవలు సొసైటీ సింబల్స్ కారు. సొసైటీలో వాళ్ళు అందరిలాంటి వారే.. విధవల జీవితం మన సమాజంలో ఇంత దుర్భలంగా మారడానికి కారణం ఈ బొట్టు తీయడమే. బొట్టు అనేది అలంకారం కాదు కళ్యాణీ స్త్రీకి... ఆత్మవిశ్వాసం కలిగించే ఓ ఆయుధం. ఈ ఆయుధం.. మన దగ్గర పదిలంగా ఉన్నంతకాలం మనల్నెవరూ జీవితంలో ఓడించలేరు.

కళ్యాణి మంత్రముగ్ధలా చూసింది నావైపు.. బలంగా వీస్తోన్న గాలికి గుడిగంటలు శ్రావ్యంగా మ్రోగాయి.

విశాలాంధ్ర
తేది 4-10-98